# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 23-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:207 పేజీలు:6 వెల: రూ.1/-


## నేటి కందం- నేటికి అందం

వ్యాపాదమ్ముల నెరుగక
నోపాటముతోడ శ్రమల కోర్చి రచించన్
దీపించెడి కావ్యములకు
కాపీ రైటందజేయ గావలయు మొగిన్

(ఏప్రిల్ 23 ప్రపంచ కాపీరైట్ దినోత్సవం)



-రాధశ్రీ

## చురక

ఉపాధి హామీల
ఉనికిపైన కేంద్ర గండి
పరుగెత్తునా కూలీనాలి
బ్రతుకుదెరువు బండి
శ్రమజీవుల సంక్షేమం
సాగు పైన కత్తిపోట్లు
ప్రభుత్వం రాయితీల
పరుగుల్లో కార్పొరేట్లు



-వేల్పుల నారాయణ
9440433475

# దండకారణ్యం చుట్టుముట్టిన పోలీసులు



- అడవిలోకి మూడు రాష్ట్రాల నుంచి వేలాది మంది పోలీసులు
- ఒక వైపు ఎన్‌కౌంటర్.. మరో వైపు తనిఖీలు
- ఎన్‌కౌంటర్‌లో ఒకరి మృతి
- మావోయిస్టుల కంచుకోట కర్రెగుట్ట వైపు భద్రతా దళాలు
- తెలంగాణ, ఆంధ్ర అటవీ గ్రామాల్లో భయానక వాతావరణం
- కాల్పులు ఆపాలని హరగోపాల్ వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 22: దండకారణ్యంలో తుపాకీల మోతతో అడవిలో అలజడి ప్రారంభమైంది. ఒక వైపు పోలీసులు, మరోవైపు భద్రతా దళాలు అడవిని చుట్టుముట్టాయి. మావోయిస్టుల కంచుకోట కర్రెగుట్ట స్వాధీనం చేసుకోవడానికి పోలీసులు, భద్రతా దళాలు దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో దండకారణ్యం చుట్టు ఉన్న గ్రామాల్లో భయానక వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే భద్రతా దళాలకు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు ప్రారంభమయ్యాయి. ఇందులో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మరికొందరు మావోయిస్టులు కర్రెగుట వైపు పారిపోయారని భద్రతా దళాలు, పోలీసులు భావించారు.

### కర్రెగుట్ట లక్ష్యంగా పోలీసు బలగాలు

ములుగు జిల్లా కర్రెగుట్ట లక్ష్యంగా పోలీసులు అడవిలోకి ప్రవేశించారు. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు ముప్పేట దాడులు చేయడం, వరుస ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలకొరగడంతో మావోయిస్టుల కంచుకోట కర్రెగుట్టకు చేరుతున్నారు. అక్కడే కీలకనాయకులు ఆవాసం ఏర్పర్చుకున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులను టార్గెట్ చేస్తూ బాంబులు అమర్చినట్లు, అటువైపు గిరిజనులు ఎవరూ రాకూడదని మావోయిస్టులు ఒక లేఖ విడుదల చేశారు. దీంతో పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా ఆపరేషన్‌కు సిద్ధపడ్డారు.

### దండకారణ్యంలోకి వేలాది మంది పోలీసులు

దండకారణ్యంలోకి సోమవారం సాయంత్రం వేలాది మంది పోలీసులు ప్రవేశించారు. తెలంగాణ నుంచి నాలుగు వేల మంది పోలీసు బలగాలు, భద్రతా దళాలు సోమవారం అడవిలోకి బయలుదేరి వెళ్లాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ చింతూరు తదితర ప్రాంతాల నుంచి రెండు వేల మంది పోలీసులు, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా జిల్లాల నుంచి ఎనిమిది వేల మంది పోలీసు, భద్రతా బలగాలు అడవుల్లోకి వెళ్లినట్లు తెలిసింది. అంతకు ముందు ఆదివారం హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు.

### బచావో కర్రెగుట్ట పేరుతో ఆపరేషన్

ములుగు జిల్లాలోని కర్రెగుట్టలను భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కర్రెగుట్టలు విస్తరించి ఉన్నాయి. కర్రెగుట్టల్లో భారీగా మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఆపరేషన్ చేపట్టారు. బచావో కర్రెగుట్టలు పేరుతో ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అటు ఛత్తీస్‌గఢ్ నుంచి ఇటు తెలంగాణ వైపు నుంచి కర్రెగుట్టలను సీఆర్పీఎఫ్ బలగాలు చుట్టుముట్టాయి.

### కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

ఊసూర్ బ్లాక్‌లోని కర్రెగుట్టల సమీపంలో మంగళవారం ఉదయం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. ఒక మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

### కాల్పులు ఆపండి: హరగోపాల్

కర్రెగుట్టలకు సంబంధించి పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఓ వీడియోను విడుదల చేశారు. తమకున్న సమాచారం మేరకు భద్రతాబలగాల వైపు నుంచి కాల్పులు జరుగుతున్నాయని, ఇప్పటికే వేలాది మంది భద్రతా బలగాలు కర్రెగుట్టల చుట్టూ మోహరించారని, వెంటనే కాల్పులు ఆపాలని డిమాండ్ చేశారు. ఓ వైపు శాంతి చర్చల ప్రతిపాదన తెస్తూనే ఇటువంటి హత్యకాండకు ప్రభుత్వాలు తెగబడటం దుర్మార్గమన్నారు. ఈ ముసుగులో సాధారణ ప్రజానీకం మరణించవచ్చని తెలిపారు. వెంటనే సాయుధ చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ముందుగా శాంతి చర్చల అడుగులు పడాలని, ఆ ప్రతిపాదన మావోయిస్టుల నుంచి కూడా వచ్చిందని తెలిపారు. శాంతి చర్చలకు అడుగులు పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో భద్రతా బలగాలను ఉసిగొల్పి మావోయిస్టులను పూర్తిస్థాయిలో అంతమొందించాలని చూడటంతో ఒక దుర్మార్గమైన చర్య అంటూ హరగోపాల్ అభిప్రాయపడ్డారు.

# హిరోషిమా అసెంబ్లీని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి !



హైదరాబాద్, ఏప్రిల్ 22:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని "తెలంగాణ రైజింగ్" బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌ను సందర్శించింది. హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ హాల్ సందర్శనకు వెళ్లిన బృందానికి అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, వారి శాసనసభ్యుల బృందం ఘనంగా స్వాగతించింది.

ముఖ్యమంత్రి వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, అధికారులు జయేష్ రంజన్, వి. శేషాద్రి, అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి అసెంబ్లీని సందర్శించారు.

శాసనసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'హిరోషిమాకు రావటం గౌరవంగా ఉంది. హిరోషిమా అంటే ఆశ. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. హిరోషిమా మాదిరిగానే ప్రజలు ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం' అని అన్నారు.

'శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని మంత్రి శ్రీధర్బాబు హిరోషిమా ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టుబడులకు కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని, కలిసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు.

ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పనిచేస్తున్నాయని, మరిన్ని కంపెనీలను మంత్రి స్వాగతించారు. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ప్రిసిషన్ మ్యానుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో గొప్ప అవకాశాలున్నాయని అన్నారు.

తెలంగాణను సందర్శించి, రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. తెలంగాణ దేశానికి గేట్ వే.. ప్రపంచానికి విస్తరించే వేదికగా ఉంటుందని అన్నారు. హిరోషిమా-హైదరాబాద్, జపాన్-తెలంగాణ మధ్య బలమైన సంబంధాల వారధిని నిర్మిద్దామన్నారు.

అసెంబ్లీ సందర్శన తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం, శాసనసభ్యుల బృందం రేవంత్ రెడ్డి బృందాన్ని గాంధీ మెమోరియల్, హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్‌ల వద్దకు తీసుకెళ్లింది.

# లక్ష్మణరేఖ వలయ సంచారం

## - వైభవంగా కులపతి భాగవతుల రామకోటయ్య శత జయంతి ఉత్సవాలు





హైదరాబాద్, ఏప్రిల్ 22:తెలంగాణలో కూచిపూడి నాట్య బీజం వేసిన మహా మహోపాధ్యాయ భాగవతుల రామకోటయ్య గారి శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి! తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీ కూచిపూడి నృత్య నిలయం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఈ ఉత్సవాలు గొప్ప స్ఫూర్తినిచ్చాయి! కులపతి భాగవతుల రామకోటయ్య గారి పరంపరను కొనసాగిస్తూ వారసత్వాన్ని ఘనంగా చాటుకుంటున్న కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య డా.భాగవతుల సేతురామ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ స్త్రీవాద రచయిత్రి వోల్గా రచించిన లక్ష్మణ రేఖ కూచిపూడి నృత్య రూపకం భాగవతుల సేతురామ్ నృత్య దర్శకత్వంలో వారి శిష్య బృందం ప్రదర్శించి కళ్ళను కట్టిపడేసారు!

కూచిపూడి సంప్రదాయం కనుమరుగైపోయి "ఏదో చేశాం" అని చేసేస్తున్న ఈరోజుల్లో కూచిపూడి సంప్రదాయ వైభవాన్ని కాపాడుకుంటూ అత్యద్భుతంగా నృత్య రూపకల్పన చేయడం లో తనకు తానే సాటి, మేటి అనిపించుకుంటున్న ఆచార్య భాగవతుల సేతురామ్ లక్ష్మణ రేఖ నృత్య రూపకం మలచడంలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆద్యంతం ఒక దృశ్య కావ్యంలా రసజ్ఞులను విశేషంగా ఆకర్షించి ఆలోచనలు రేకెత్తించింది. 20 ఏళ్ల క్రితం వోల్గా రచించిన లక్ష్మణ రేఖకు కన్నబాబు సంగీత దర్శకత్వం మరో అద్భుతం అని చెప్పాలి! ఇప్పుడు కన్నబాబు లేరు. ఆయన అందించిన సంగీతం ఆయన్ని గుర్తు చేస్తూ ఉంది. వోల్గా, మృణాళిని స్వరాలు ప్రత్యేక ఆకర్షణ. భాగవతుల సేతురామ్ నృత్య దర్శకత్వంలో ప్రదర్శన ఆద్యంతం రోమాంచితం. కొన్ని సన్నివేశాలు కొన్ని దృశ్యాలు ప్రేక్షకులను హృద్యంగా గుచ్చి పడేసాయి!


ప్రపంచమంతటా అనాదిగా సాగుతున్న హింసా రూపాలను తట్టుకుని నలిగి పోరాడి చివరకు గెలిచిన శక్తి స్వరూపుల స్త్రీల కథలే వోల్గా నృత్య రూపక రచన లక్ష్మణ రేఖ! యుగయుగాల నుంచి స్త్రీ జీవితంలో ఇప్పటికీ మార్పు లేదనే జగమెరిగిన వాస్తవాన్ని లక్ష్మణ రేఖ చాటిచెప్పింది!

గాంధారి నుంచి నిన్నటి పల్లవి వరకు పురుషాధిక్యత రేఖ వలయ సంచారంలో నలిగి కుమిలి చివరకు ధైర్యంగా పోరాడి గెలిచిన యోధలు! మగాళ్ల ఆలోచనల మార్పు కోసం ఎదురు చూడకుండా, స్త్రీ ఆలోచనల్లోనే మార్పు రావాలని, మహిళలే ఒకరికొకరు సహకరించుకుని జీవితాలను మెరుగు పరచుకోవాలంటూ గొప్ప సందేశాన్ని చాటింది లక్ష్మణ రేఖ.

గాంధారిగా డా.యశోద ఠాకూర్, ఊర్మిళగా రోహిణి ప్రసాద్, రేణుకగా మాడభూషి రమణి సిద్ధి ఆయా పాత్రల్లో ఒదిగి ఈ ఆధునిక నృత్య రూపకానికి ప్రాణం పోశారు! ఇప్పటికే 200 పైగా ప్రదర్శనలు జరిగినప్పటికి, పదేళ్ల తరువాత మళ్ళీ ప్రదర్శించినా కొత్తదనంతో ఆకట్టుకుంది. డా.అనీల, శ్రేష్ఠ సూత్రధారులుగా వ్యవహరించారు. బిందు అభినయ్, త్రివేణి, సృజన, సంధ్యారాణి, క్రాంతి కిరణ్, శ్రీనివాస్ భావ నర్తకులుగా ఆకట్టుకున్నారు. రంగోద్దీపనం, ఆహార్యం వెరసి ఆద్యంతం నృత్య రూపకం జనరంజకమైంది.


ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో తెలంగాణ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి దేవసేన అల్లంరాజు ముఖ్య అతిధిగా పాల్గొనారు. భాగవతుల రామకోటయ్య దగ్గర కొన్ని రోజులు స్వయంగా కూచిపూడి నేర్చుకున్న ఐఎఎస్ అధికారి ఈమె! ఆ జ్ఞాపకాలను ఆమె గుర్తు చేశారు. ప్రొఫెసర్ అనూరాధ తడకమళ్ళ, వోల్గా, రోజా రమణి, డా.మహ్మద్ రఫీ పాల్గొని భాగవతుల సేతురామ్ దంపతులను ఘనంగా సత్కరించారు. శిష్య బృందాన్ని అభినందించారు. సుధామాల వ్యాఖ్యానం అదనపు ఆకర్షణ. భాగవతుల మోహిత్ రామ్, శ్రీలేఖ తదితరులు సమన్వయం చేశారు. కులపతి భాగవతుల రామకోటయ్య గారికి ఘన నివాళులు అర్పించారు.

- డా. మహ్మద్ రఫీ



# జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి.. ముగ్గురు పర్యాటకులు దుర్మరణం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: జమ్ముకశ్మీర్ లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పహల్గామ్ (ఖజీప్తజీశ్రీణజీఎ) లోని బైసరన్ లోయలో కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ముగ్గురు పర్యాటకులు మరణించారు. మరో ఆరుగురు పర్యాటకులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న భద్రతా బలగాలు, వైద్య బృందాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు.

క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. బైసరన్ లోయలో ట్రెక్కింగ్ ట్రిప్ కోసం వెళ్లిన పర్యాటకులపై ఇవాళ (మంగళవారం) మధ్యాహ్నం గుర్తుతెలియని ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల్లో గాయపడిన వారిలో ముగ్గురు స్థానికులు కాగా, మరో ముగ్గురు ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. ఘటన నేపథ్యంలో పహల్గామ్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# ఉగ్రవాదుల దాడిపై ప్రధాని ఆరా.. జమ్ముకశ్మీర్‌కు హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇవాళ పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని అమిత్‌షాను ప్రధాని ఆదేశించారు.

ఈ ఉగ్రదాడిపై అమిత్ షా స్పందిస్తూ.. పర్యటకులపై దాడి తీవ్రంగా బాధించిందన్నారు. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటన గురించి ప్రధాని మోదీకి వివరించానని, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించానని చెప్పారు. అత్యవసర భద్రతా సమీక్ష కోసం తాను శ్రీనగర్ వెళ్తున్నానిని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి ట్వీట్ చేశారు.

కాగా ఈ ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారు మానవ మృగాలని, ఘటనను ఖండించేందుకు మాటలు రావడం లేదని సోషల్ మీడియా వేదికగా ఒమర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# శాంతిదూతకు రేవంత్ రెడ్డి ఘన నివాళి

హిరోషిమా ఏప్రిల్ 22: జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం నేడు హిరోషిమా నగరంలో పర్యటించింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి జాతిపిత, శాంతిదూత మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే షిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అటామిక్ బాంబ్ డోమ్‌ను సందర్శించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన రెండవ ప్రపంచ యుద్ధంలో అణు బాంబు దాడిలో మరణించిన వారికి సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు.

# ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడదల

## -సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత, ఫస్టియర్‌లో 66.89 శాతం ఉత్తీర్ణత
## - గతం కన్నా ఉత్తీర్ణత శాతం పెరిగిన ఉత్తీర్ణత.. బాలికలదే పై చేయి



హైదరాబాద్ ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడదలయ్యాయి.

మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడదల చేశారు. ఇంటర్ సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత, ఫస్టియర్‌లో 66.89 శాతం ఉత్తీర్ణత విద్యార్థులు సాధించారు. గతం కన్నా ఉత్తీర్ణత శాతం పెరిగింది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ సారి ఇంటర్ ఫలితాలలో బాలికలదే హవా కొనసాగింది. 9.5 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. గత నెల 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఇంటర్ ఫలితాలు చూడలంటే కింద లింక్‌ను ఓపెన్ చేస్తే కనిపిస్తాయి.

# 'జన భాగీదారి' వల్ల జి-20 ప్రజా ఉద్యమంగా మారింది..

## భారత్ కేవలం పాల్గొనేందుకు పరిమితంకాక నేతృత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:ఈ రోజు న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో 17వ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సివిల్ సర్వెంట్లనుద్దేశించి ప్రసంగించారు. ప్రజాపాలన (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రధానమంత్రి శ్రేష్ఠత అవార్డులను ప్రదానం చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన శ్రీ మోదీ, సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంవత్సరం రాజ్యాంగం 75వ సంవత్సరాల వేడుకలు, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా సివిల్ సర్వీసెస్ డే మరింత విశిష్ఠతను సంతరించుకుందన్నారు. అలనాడు 1947 ఏప్రిల్ 21న సర్దార్ పటేల్ చేసిన ప్రకటనను ఉటంకిస్తూ, సర్దార్ సివిల్ సర్వెంట్లను 'భారత దేశ ఉక్కు కవచం'గా అభివర్ణించారని గుర్తు చేశారు. పూర్తి అంకితభావంతో పని చేస్తూ, క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టే పాలనా యంత్రాంగాన్ని పటేల్ కోరుకున్నారని చెప్పారు. వికసిత్ భారత్ ఆశయ సాకారంలో సర్దార్ పటేల్ ఆదర్శాలు దారిదీపాలంటూ, పటేల్ దార్శనికత, వారసత్వానికి హృదయపూర్వక నివాళి అర్పించారు.

గతంలో ఎర్రకోట ప్రసంగం సందర్భంగా, దేశం కోసం వచ్చే వెయ్యేళ్లకు సరిపడే గట్టి పునాదులను నిర్మించాలని తాను అన్నానని, నూతన సహస్రాబ్దిలో 25 సంవత్సరాలు గడిచిపోయాయని, కొత్త సహస్రాబ్ది, శతాబ్దిలో ఇది 25వ సంవత్సరమని వ్యాఖ్యానించారు. "నేడు అమలు చేస్తున్న విధానాలు, చేపడుతున్న నిర్ణయాలు వచ్చే వెయ్యేళ్ళ భవితవ్యాన్ని నిర్దేశిస్తాయి" అని ప్రధాని అన్నారు. తగినంత కృషి చేయకుండా కేవలం అదృష్టంపైనే ఆధారపడటం ఒంటి చక్రంతో ముందుకుసాగని రథం వంటిదని పురాణ వాక్యాలను ఉదహరిస్తూ అన్నారు. సంపూర్ణంగా అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని అందుకునేందుకు ఉమ్మడి కృషి, పట్టుదలలు కీలకమైనవని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ, ప్రతి క్షణం ఈ ఉమ్మడి లక్ష్య సాధనకు కృషి చేయాలని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్న మార్పులను ప్రస్తావిస్తూ, కుటుంబాల్లో కూడా కొత్త తరం వారితో సంభాషించే మునుపటి తరం వారికి వెనకబడ్డ భావన కలుగవచ్చని, ప్రతి రెండు మూడేళ్ళకొకసారి సాంకేతికతలో సమూలమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, పిల్లలు ఈ మార్పుల మధ్య పెరిగి పెద్దవుతున్నారని వ్యాఖ్యానించారు. కాలం చెల్లిన పద్ధతులు, విధాన నిర్ణయాలను ప్రభుత్వోద్యోగులు అనుసరించరాదని శ్రీ మోదీ చెప్పారు. వేగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారాలన్న ఆశయంతో 2014లో గొప్ప మార్పులు చేపట్టినట్లు గుర్తు చేశారు. అంబరాన్నంటుతున్న యువత, రైతాంగం, మహిళాలోకం అసాధారణ ఆకాంక్షలను ప్రస్తావిస్తూ, వీటిని నెరవేర్చేందుకు అత్యంత వేగం అవసరమని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ఇంధన భద్రత.. పరిశుభ్రమైన ఇంధనం.. క్రీడలు, అంతరిక్ష పరిశోధనల్లో ముందంజ.. వంటి లక్ష్యాలను సాధించాలని భారత్ ఆశిస్తోందని, ప్రతి రంగంలోనూ దేశ జెండా రెపరెపలాడాలని అన్నారు. ప్రపంచ దేశాల్లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవాలన్న ఆశయ సాకారంలో సివిల్ సర్వెంట్ల బాధ్యత కీలకమైనదని, ఈ ప్రయాణంలో జాగుని నివారిస్తూ సకాలంలో లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వ అధికారులు చేయూతనందించాలని పిలుపునిచ్చారు.

ఈ సంవత్సరం సివిల్ సర్వీసెస్ డే ఇతివృత్తమైన 'దేశ సమగ్ర అభివృద్ధి' పట్ల సంతృప్తిని వ్యక్తం చేసిన శ్రీ మోదీ, ఇది కేవలం ఇతివృత్తం మాత్రమే కాదని, దేశ ప్రజలకు ఇచ్చే వాగ్దానమని అన్నారు. "భారత సమగ్రాభివృద్ధి అంటే దేశంలోని ఏ ఒక్క పౌరుడు, కుటుంబం, గ్రామం వెనకబడి ఉండే వీలు లేదు" అని స్పష్టం చేశారు. మందకొడిగా జరిగే చిన్న చిన్న మార్పులను నిజమైన అభివృద్ధిగా నిర్వచించలేమని, భారీ ప్రభావాన్ని కలుగజేసేదే సిసలైన అభివృద్ధి అని ప్రధాని అన్నారు. ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు, బాలలకు నాణ్యమైన విద్య, వ్యాపారవేత్తలకు అందుబాటులో పెట్టుబడి, ప్రతి గ్రామానికి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ లాభాల వంటివి చేకూరినప్పుడే సమగ్ర అభివృద్ధిగా పరిగణించగలమని అన్నారు. కేవలం కొత్త పథకాలను ప్రవేశపెట్టడం నాణ్యమైన పాలన అనిపించుకోజాలదని, పథకాల విస్తృతి, క్షేత్రస్థాయిలో చూపే సత్ఫలితాలే నాణ్యమైన పాలనను నిర్ధారించే అంశాలని ప్రధాని చెప్పారు. రాజకోట్, గోమతి, తిన్సుకియా, కోరాపుట్, కుప్వాడా వంటి జిల్లాల్లో పాఠశాల్లో బాలల హాజరు మెరుగయ్యిందని, సౌర విద్యుత్తు వాడకం పెరిగిందని, అనేక స్పష్టమైన మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. ఈ పథకాలతో అనుబంధంగల వ్యక్తులకు, జిల్లాలకు అభినందనలు తెలుపుతూ, ఈ విజయాన్ని సాధించడంలో ఆయా వ్యక్తులు చేసిన కృషిని, జిల్లాలకు దక్కిన పురస్కారాలని గురించి తెలియజేశారు.

గత పదేళ్ళుగా దేశం మందకొడి సరళి నుంచి బయటపడి ప్రభావశీల పరివర్తనను చవి చూస్తోందని ప్రధాని అన్నారు. ప్రభుత్వ విధానం ఇప్పుడు కొత్త తరం సంస్కరణలకు ప్రాధాన్యమిస్తోందని, ఇవి అత్యాధునిక సాంకేతికత, సృజనాత్మక పరిష్కారాల సహాయంతో ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సంస్కరణల మార్పు గ్రామీణ, నగర, మారుమూల ప్రాంతాల్లో సైతం ఒకే రకంగా కనిపిస్తోందని అన్నారు. ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకుల పథకం సాధించిన ఘన విజయాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ, 2023 జనవరిలో ప్రారంభించిన ఈ పథకాలు కేవలం రెండేళ్ళ కాలంలో అపూర్వమైన ఫలితాలను చూపాయని అన్నారు. ఆయా బ్లాకుల్లో ఆరోగ్యం, పోషకాహారం, సాంఘిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లో మెరుగుదల వంటి సూచీల్లో గణనీయమైన ప్రగతి కనిపించిందని చెప్పారు. పరివార్తనాత్మక మార్పుల ఉదాహరణలను పంచుకుంటూ, రాజస్థాన్ టోంక్ జిల్లా, పీప్లూ బ్లాకులోని అంగన్వాడీ కేంద్ర బాలల సామర్థ్యాల్లో 20 శాతం నుంచి 99 శాతం మెరుగుదల నమోదయ్యిందని, అదే విధంగా బీహార్ భాగాల్ పూర్ జగదీశ్ పూర్ బ్లాకులో తొలి మూడు నెలల్లో నమోదైన గర్భిణుల సంఖ్య 25 శాతం నుంచి 90 శాతానికి పెరిగిందని చెప్పారు. ఇక జమ్మూకాశ్మీర్ మార్వా బ్లాకులో ఆరోగ్య కేంద్రాల్లో జరిగే శిశు జననాలు 30 శాతం నుంచి 100 శాతానికి పెరిగాయని, జార్ఖండ్ గుర్డీ బ్లాకులో నీటి కనెక్షన్లు 18 శాతం నుంచి 100 శాతానికి పెరిగాయని చెప్పారు. ఇవన్నీ కేవలం గణాంకాలు కావని, క్షేత్రస్థాయిలో ప్రతి పౌరుడికీ పథకాల లబ్ధిని అందించి తీరాలన్న ప్రభుత్వ పట్టుదలకి నిదర్శనమని చెప్పారు. "సరైన ఉద్దేశం, ప్రణాళిక, అమలుల ద్వారా మారుమూల ప్రాంతాల్లో సైతం పరివర్తన సాధ్యమే" అని శ్రీ మోదీ చెప్పారు.

గత దశాబ్ద కాలంలో సాధించిన ప్రగతిని ప్రస్తావిస్తూ, పరివార్తనాత్మక మార్పుల ద్వారా దేశం కొత్త శిఖరాలను చేరుకుందని ప్రధానమంత్రి అన్నారు. "వేగవంతమైన అభివృద్ధి సాధించిన దేశంగానే కాక, పరిపాలన, పారదర్శకత, కొత్త ఆలోచనలను అవలంబించడంలో నూతన ప్రమాణాలు నెలకొల్పిన దేశంగా మనం గుర్తింపు తెచ్చుకుంటున్నాం" అని శ్రీ మోదీ అన్నారు. ఈ విజయాలకు జి-20 చక్కని ఉదాహరణ అన్న ప్రధాని, జి-20 చరిత్రలోనే తొలిసారిగా 60 నగరాల్లో 200 కి పైగా సమావేశాలు ఏర్పాటయ్యాయని, వీటిలో ప్రజలందరికీ పాల్గొనే అవకాశాలు కల్పించడంతో జి-20 ప్రజా ఉద్యమంగా మారిందని చెప్పారు. "భారత్ నాయకత్వ పాత్రను ప్రపంచం గుర్తించింది... ఈ సమావేశాల్లో పాల్గొనేందుకే పరిమితమవక మనం నేతృత్వం వహించాం" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రధాని ప్రభుత్వ సామర్థ్యం అంశంపై నానాటికీ తీవ్రమవుతున్న చర్చలను ప్రస్తావించి, ఈ విషయంలో భారత్ ఇతర దేశాల కన్నా 10-11 సంవత్సరాలు ముందుందన్నారు. గడచిన 11 సంవత్సరాల్లో చేసిన జాప్యాలను అంతం చేయడానికి ఒక పనిని పూర్తి చేయడానికి పట్టే సమయాన్ని తగ్గించేందుకు సాంకేతికతను ఉపయోగించడం, కొత్త ప్రక్రియలను ప్రవేశపెట్టడం వంటి ప్రయత్నాలు చేశామన్నారు. వ్యాపార నిర్వహణలో సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి నియమపాలనకు సంబంధించిన 40,000కు పైగా నిబంధనలను రద్దు చేయడంతోపాటు 3,400 చట్ట నిబంధనలను అపరాధాల నిర్వచనం పరిధిలో నుంచి తప్పించామని తెలిపారు. ఈ సంస్కరణలకు నడుం బిగించిన వేళ ఎదురైన ప్రతిఘటనను ప్రధాని గుర్తుచేస్తూ, విమర్శకులు ఆ తరహా మార్పుల అవసరమేముందని ప్రశ్నించారన్నారు. ఏమైనా, ప్రభుత్వం అలాంటి ఒత్తిడికి తలొగ్గలేదని ఆయన స్పష్టంచేశారు. కొత్త ఫలితాలను రాబట్టాలంటే కొత్త దృష్టికోణాన్ని అవలంబించడం అవసరమన్నారు. ఈ తరహా ప్రయత్నాల ఫలితంగా వాణిజ్య నిర్వహణలో సౌలభ్యం తాలూకు ర్యాంకుల్లో మెరుగుదల చోటుచేసుకున్న సంగతిని కూడా ఆయన ప్రధానంగా చెబుతూ, భారత్‌లో పెట్టుబడి పెట్టడానికి ప్రపంచవ్యాప్తంగా ఉత్సాహం వెల్లువెత్తుతోందన్నారు. రాష్ట్రాలలో, జిల్లాల్లో, బ్లాకు స్థాయిల్లో వేర్వేరు పనుల్లో జాప్యాన్ని నివారించి, ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాల్సిన అవసరం ఉందని, ఇది జరిగినప్పుడు మనం పెట్టుకున్న లక్ష్యాల్ని ప్రభావవంతమైన విధంగా సాధించుకోవచ్చన్నారు.

"గత 10-11 సంవత్సరాల్లో సాధించిన విజయాలతో అభివృద్ధి చెందిన భారతదేశానికి బలమైన పునాది పడింది" అని శ్రీ మోదీ అభివర్ణించారు. ప్రస్తుతం దేశం ఈ దృఢ పునాదుల మీద వికసిత్ భారత్ అనే ఒక గొప్ప భవనాన్ని నిర్మించడం మొదలుపెడుతోందంటూ, రాబోయే కాలంలో సవాళ్లు కూడా పొంచి ఉన్నాయన్నారు. ప్రపంచంలో అత్యంత ఎక్కువ మంది జనాభాను కలిగి ఉన్న దేశంగా మారిందని, కనీస సదుపాయాలను అందరికీ కలగజేయడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సి ఉందని ఆయన చెప్పారు. అభివృద్ధి ఫలాలు సమాజంలో అన్ని వర్గాలకూ అందేటట్టు చూడాలంటే ఆఖరి లబ్ధిదారు వరకు చేరుకోవడంపైన శ్రద్ధ వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పౌరుల అవసరాలు రోజురోజుకూ మారుతున్నాయి. వారి ఆకాంక్షలు కూడా పెరుగుతున్నాయని ఆయన చెబుతూ పౌర సేవ సందర్భానికి తగినట్లుగా తనను తాను తీర్చిదిద్దుకోవాలంటే అందుకు సమకాలీన సవాళ్లను గుర్తెరగాలని ఆయన తెలిపారు. కొత్త ప్రమాణాలను ఏర్పరచుకొంటూ, మునుపటి పోలికలను విడిచిపెట్టి శరవేగంగా ముందుకు కదలాలని శ్రీ మోదీ స్పష్టంచేశారు. 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌ను ఆవిష్కరించాలన్న దార్శనికతకు అనుగుణంగా ప్రగతిని కొలవాలనీ, ప్రతి ఒక్క రంగంలోనూ లక్ష్యాలను సాధించడానికి ఇప్పుడు పయనిస్తున్న వేగం సరిపోతుందా అనేది పరిశీలించుకోవాలనీ, అవసరమైన చోటల్లా ప్రయత్నాలను వేగవంతం చేయాలనీ ఆయన సూచించారు. ఇవాళ సాంకేతిక రంగంలో అందుబాటులో ఉన్న ఆధునికతను ఆయన ప్రస్తావిస్తూ ఈ బలాన్ని వినియోగించుకోండని హితవు పలికారు.

గత పదేళ్లలో పూర్తి చేసిన పనులను శ్రీ మోదీ ప్రధానంగా చెబుతూ... పేదల కోసం 4 కోట్ల ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు. మరో 3 కోట్ల మందికి గృహ వసతిని కల్పించే లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. త్వరలో ప్రతి గ్రామీణ కుటుంబానికి నల్లా కనెక్షనును సమకూర్చాలనేదే ధ్యేయమనీ, దీనిలో భాగంగా రాబోయే అయిదారేళ్లలో 12 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాలకు నీటిని నల్లా ద్వారా అందిస్తారన్నారు. సమాజంలో నిరాదరణకు గురైన వర్గాల వారి కోసం గత 10 సంవత్సరాల్లో 11 కోట్లకుపైగా మరుగుదొడ్లను నిర్మించినట్లు కూడా ఆయన చెప్పారు. వృద్ధుల నిర్వహణలో సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకొని, ఆదరణకు నోచుకోని లక్షల మందికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సను అందించే ఏర్పాటు చేశామన్నారు. పౌరులకు పోషణను మెరుగుపరచడానికి సరికొత్త నిబద్ధత ప్రదర్శించాలని శ్రీ మోదీ పునరుద్ఘాటిస్తూ సమాజంలో అందరూ చక్కని ఆహారాన్ని అందుకోవాలన్నదే అంతిమ ధ్యేయమని స్పష్టంచేశారు. ఈ విధానం గత దశాబ్దకాలంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తులను చేసిందని, ఇది క్రమంగా పేదలంటూ ఉండని భారత్ నిర్మాణానికి బాటను వేస్తుందన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు.

పారిశ్రామికీకరణ, ఔత్సాహిక పారిశ్రామికత్వం.. ఈ రెండిటి జోరుకు పగ్గం వేసే నియంత్రణదారు పాత్రను ఇదివరకటి అధికార యంత్రాంగం పోషించిందని ప్రధాని చెబుతూ, దేశం ఈ రకమైన మానసిక ధోరణి నుంచి బయటపడి ముందుకు కదిలిందన్నారు. దేశం ఇప్పుడు పౌరుల్లో వాణిజ్య సంస్థల్ని ఏర్పాటు చేయాలన్న వైఖరిని ప్రోత్సహించడంతో పాటు వారికెదురయ్యే అడ్డంకుల్ని జయించడంలో వారికి సహాయపడే వాతావరణాన్ని పెంచిపోషిస్తోందని ప్రధాని చెప్పారు. "సివిల్ సర్వీసులు ఒక సహాయకారిగా మారితీరాల్సి ఉంది, అవి వాటి భూమికను కేవలం నియమావళి గ్రంథాల సంరక్షణదారు స్థాయి నుంచి ముందుకు కదలి వృద్ధికి తోడ్పడే స్థాయికి మెరుగుపరచుకోవాలి" అని ఆయన అన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈ రంగాన్ని ఒక ఉదాహరణగా ఆయన చెబుతూ, యుద్ధ ప్రాతిపదికన తయారీ రంగానికి ఉన్న ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ మిషన్ విజయవంతం కావడం ఎమ్ఎస్ఎమ్ఈలపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రపంచంలో చోటు చేసుకొంటున్న మార్పుల మధ్య భారత్‌లో ఎమ్ఎమ్ఎస్ఈలు, అంకుర సంస్థలు, యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఇదివరకు ఎరుగని ఒక కొత్త అవకాశాన్ని పొందుతున్నారని ప్రధాని చెప్పారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో మరింత పోటీతత్వాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందనీ, ఎమ్ఎస్ఎమ్ఈలు ఒక్క చిన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచే కాకుండా ప్రపంచ స్థాయిలో సైతం పోటీకి ఎదురొడ్డాల్సివస్తోందన్నారు. ఏదైనా ఒక చిన్న దేశం తన పరిశ్రమలకు నియమాల అనుసరణలో మరింత సౌలభ్యాన్ని అందించిన పక్షంలో, ఆ దేశం భారతీయ అంకుర సంస్థలను తోసిరాజని ముందుకు దూసుకుపోగలుగుతుందన్నారు. ఈ కారణంగా, ప్రపంచ స్థాయి అత్యుత్తమ పద్ధతులతో పోలిస్తే భారత్ తన స్థితిని నిరంతర ప్రాతిపదికన లెక్కగట్టుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ఉత్పాదనలను రూపొందించడమే భారతీయ పరిశ్రమల లక్ష్యం కాగా ప్రపంచంలో నియమాల అనుసరణలో సౌలభ్యం పరంగా అత్యుత్తమ వాతావరణాన్ని అందించడమే భారత్‌లో అధికార యంత్రాంగం లక్ష్యం కావాలని ప్రధాని చెప్పారు.

టెక్నాలజీని అర్థం చేసుకోవడంలో సాయపడే నైపుణ్యాలను ప్రభుత్వ అధికారులు సాధించాలనీ, ఆ నైపుణ్యాలను స్మార్ట్ గవర్నెన్స్ కోసం, ఇంక్లూసివ్ గవర్నెన్స్ కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉందనీ శ్రీ మోదీ స్పష్టం చేశారు. "టెక్నాలజీ యుగంలో, పాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం ఒక్కటే కాదు, అది సాధ్యమయ్యేలా అనేక రెట్లు పెంచడంతో సైతం ముడిపడి ఉన్న అంశం" అని ఆయన వ్యాఖ్యానించారు. విధానాలను, పథకాలను టెక్నాలజీని ఉపయోగించుకొంటూ మరింత తెలివిగానూ, సులభమైనవిగానూ తీర్చిదిద్దడానికి ప్రాముఖ్యానివ్వాలని ఆయన అన్నారు. నిర్దుష్టమైన విధానాల రూపకల్పన, అమలుకుగాను డేటా ఆధారితమైన నిర్ణయాల్ని తీసుకోవడంలో ప్రావీణ్యాన్ని సంపాదించాలని ఆయన ప్రధానంగా చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ ఫిజిక్స్‌లలో కొత్త కొత్త మార్పులు వేగంగా సంభవిసున్నాయని, వీటిని బట్టి చూస్తూ ఉంటే టెక్నాలజీ లో రాబోయే విప్లవం డిజిటల్ యుగాన్ని, సమాచార యుగాన్ని అధిగమించగలదని శ్రీ మోదీ అభిప్రాయపడ్డారు. ఈ రకమైన సాంకేతిక విప్లవానికి సన్నద్ధులుగా ప్రభుత్వ అధికారులు తమను తాము మలచుకోవాలని ఆయన కోరుతూ, అప్పుడు వారు ఉత్తమ సేవలను అందించడంతోపాటు పౌరుల ఆకాంక్షలను కూడా నెరవేర్చగలుగుతారన్నారు.




ఆహ్వానం

యోధ-కథాసంకలనం విజయోత్సవ సభ శ్రామిక మహిళ-అవగాహన సదస్సు

సమయం : 27 ఏప్రిల్ 2025 ఆదివారం ఉ॥ 11 గం॥ - సా॥ 5:30 గం॥

వేదిక : ఐలమ్మహాల్ - సుందరయ్య విజ్ఞానకేంద్రం, భాగ్ లింగంపల్లి - హైదరాబాద్

'యోధ' - విజయోత్సవ సభ

ఉ॥ 11 గం॥ - సా॥ 11:30 గం॥

అధ్యక్షత : భండారు విజయ (సంపాదకురాలు)

గౌరవఅతిథి : ఓల్గా రచయిత్రి

నిర్వహణ : గిరిజ పైడిమర్రి రచయిత్రి

శ్రామిక మహిళ - అవగాహన సదస్సు

ఉ॥ 11:30 గం॥ - సా॥ 1:30 గం॥

అధ్యక్షత : ఎస్. ఆశాలత మకాన్

ప్రధానవక్త : ఓల్గా రచయిత్రి

వక్తలు : డా॥ యు. వింధ్య ఫెమినిస్ట్ స్కాలర్

డా. బి.వి. విజయలక్ష్మి, పూర్వ జాతీయ కార్యదర్శి, ఎఐటియుసి

వి. సంధ్య పి.ఓ.డబ్ల్యూ

భోజన విరామం 1:30 - 2:30 గం॥

అసంఘటిత రంగాలలో మహిళలు - శ్రమదోపిడి

మ॥ 2:30 గం॥ - సా॥ 5:30 గం॥

| అంశం | వక్తలు |
|---|---|
| డొమెస్టిక్ వర్కర్స్ | సిస్టర్ లిజి |
| భవన నిర్మాణ కార్మికులు | అనూరాధ |
| బీడీ కార్మికులు | అరుణ |
| పారిశుద్ధ్య కార్మికులు | జయ |
| స్కావెంజర్ కార్మికులు | సరస్వతి |
| చేనేత కార్మికులు | ముళ్ళపూడి సుధారాణి |
| వ్యవసాయ రైతుకూలీలు | ఉషా సీతాలక్ష్మి |
| మోచీ వర్కర్స్ | డా॥ చిలుకా భాస్కర్ |
| విశ్వకర్మ కార్మికులు | బ్రహ్మాచారి (నిధి) |
| కుమ్మరి కార్మికులు | నాంపల్లి సుజాత |
| ఇతర వృత్తుల మహిళా కార్మికులు | ఎడ్ల జయ |
| వందన సమర్పణ | వి. శాంతిప్రబోధ |

హస్మిత ప్రచురణలు, హైదరాబాద్

హైదరాబాద్ ఉమెన్ రైటర్స్ ఫోరం & వృత్తి సంఘాల సౌజన్యంతో ...


# 1350 లీటర్ల నాటు సారా బెల్లం ఊట ధ్వంసం

అమరావతి, ఏప్రిల్ 22:కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారు జామున నగరంలోని బంగారుపేటలో నాటుసారా స్థావరాలపై కర్నూలు రెండవ పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సమన్వయంతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణరెడ్డి, కర్నూలు పట్టణ సిఐలు నాగరాజారావు, మన్సురుద్దీన్, నాగశేఖర్, ఎక్సైజ్ సిఐలు చంద్రహాస్, జయరాం నాయుడు, క్రిష్ణ, 5 బృందాలుగా ఏర్పడి దాడులు చేశారు.

65లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 1350 లీటర్ల నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారాకు కారకులైన ఒకరిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన ఆవశ్యకత గురించి, నాటుసారా వలన వచ్చే అనర్థాల గురించి తెలియజేస్తూ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే నాటుసారా జోలికి వెళ్లొద్దని, నాటుసారా కాసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు పోలీసులు హెచ్చరిస్తున్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు ఇక నుండి మానుకోవాలని పోలీసులు హితవు పలికారు.

# పచ్చదనం పునరుద్ధరించడంలో కేసీఆర్ ఆదర్శం - మాజీ ఎంపి సంతోష్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 22:పచ్చదనం పునరుద్ధరించడంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదర్శప్రాయుడు అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు జె.సంతోష్ కుమార్ అన్నారు. భూమి దినోత్సవం సందర్భంగా మంగళవారం తన ఎక్స్ వేదికగా పర్యావరణ ప్రేమికులకు, ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. అలాగే కేసీఆర్ మొక్క నాటుతున్నట్లు ఓ చిత్రాన్ని కూడా పోస్టు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన గ్రహం అందం ఉమ్మడి నిధి. చెట్లను నాటడం, పరిసరాలను శుభ్రపరచడం, అవగాహన పెంచడం ద్వారా మనం పెద్ద పరివర్తనలకు నాంది పలకవచ్చని పేర్కొన్నారు. పచ్చదనాన్ని పునరుద్ధరించడంలో శ్రీ కేసీఆర్ గారి ఆదర్శప్రాయమైన ప్రయత్నాల నుండి ప్రేరణ పొంది, తరతరాలుగా పచ్చదనం, ప్రకాశవంతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

అమెరికాలో కాలుష్యం, పర్యావరణ క్షీణత గురించి పెరుగుతున్న ప్రజా అవగాహన తర్వాత, మొదటి ఎర్త్ డేను ఏప్రిల్ 22, 1970న జరుపుకున్నారు. విద్యార్థుల యుద్ధ వ్యతిరేక నిరసనల శక్తిని పర్యావరణ అవగాహనలోకి మళ్లించడం లక్ష్యంగా పెట్టుకున్న సెనేటర్ గేలార్డ్ నెల్సన్ దీనిని ప్రారంభించారు. అప్పట్లో ఈ కార్యక్రమంలో 20 మిలియన్ల అమెరికన్లు పర్యావరణ సంస్కరణలను డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వచ్చారు. ఇది ఆ కాలంలో అతిపెద్ద పౌర కార్యక్రమంగా మారింది. దశాబ్దాలుగా, ఎర్త్ డే ఒక ప్రపంచ ఉద్యమంగా పరిణామం చెందింది. దీనిని 190 కంటే ఎక్కువ దేశాలలో పాటిస్తున్నారు.

# తెలంగాణ ప్రజల భవిష్యత్ గురించి కేసీఆర్ దిశా నిర్దేశం.. బీఆర్ఎస్ రజతోత్సవ సభపై ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 22: వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు దండులా కదిలి వచ్చి విజయవంతం చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పిలుపునిచ్చారు.

ఇవాళ జహీరాబాద్ పట్టణంలో జహీరాబాద్ మండల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరుగనున్న రజతోత్సవ సభలో కేసీఆర్ తెలంగాణ ప్రజల భవిష్యత్ గురించి దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

# పోలవరంను సందర్శించండి

## - కేంద్ర మంత్రి పాటిల్ కు చంద్రబాబు ఆహ్వానం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీలోని ఆయన మంత్రిత్వ కార్యాలయంలో భేటి అయ్యారు.. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు.. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్ర శేఖర్, టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, అప్పలనాయుడు, హరీష్ బాలయోగి, సానా సతీష్ తదితరలు పాల్గొన్నారు.. అయితే, పోలవరం ప్రాజెక్ట్ కు నిధులుతో పాటు, బనకచర్ల ప్రాజెక్ట్ కు అనుమతులుపై ఈ సమావేశంలో చర్చించారు.. బనకచర్ల ప్రాజెక్ట్ ద్వారా నీటి ఎద్దడిని ఎదుర్కనే రాయలసీమ ప్రాంతానికి జలాలు అందించాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉంది.. గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేస్తూ బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది..

గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం ఆలోచనగా ఉంది.. అయితే, దీనిపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వేళ.. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు, ఆర్థిక సహకారాన్ని కోరుతున్నారు చంద్రబాబు నాయుడు.. దానిలో భాగంగా ఈ రోజు కేంద్ర జలశక్తి మంత్రిని కలిశారు.. మరోవైపు.. పోలవరం ప్రాజెక్ట్ పురోగతి, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తయ్యేలా సహకారం అందించాలని కూడా కేంద్రమంత్రిని కోరారు చంద్రబాబు.. ఇక, పోలవరం ప్రాజెక్ట్ ను సందర్శించాలని కేంద్రమంత్రిని ఆహ్వానించారు చంద్రబాబు నాయుడు.

# చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22 చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు లక్ష్మీపతి గౌడ్ అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం, అవుసలోనిపల్లి గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు రకాల సేవలను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. రూ. 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ, ఎస్టీలు ఉచితంగా ఒక లాయర్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి పౌరుడు ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎవరూ కూడా ధిక్కరించరాదని, ప్రతి ఒక్కరూ చట్టానికి అనుగుణంగా నడచుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, ఫోక్సో, రైతు చట్టాల గురించి వివరించారు. లీగల్ ఎయిడ్ అసిస్టెంట్ కౌన్సిల్ సభ్యులు నాగేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని, ప్రతి రోజు పిల్లలకు మంచి ఆహారం ఇవ్వాలని, వారి అవసరాలు తీర్చడానికి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నారాయణ, చైల్డ్ లైన్ సిబ్బంది శ్రావణ్ కుమార్, తిరుపతయ్య, హాజమ్మ, సుకన్య, వర్ష, ఉమ, చెన్నప్ప, భీమమ్మ, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్టపాక ప్రాథమిక పాఠశాలలో ఘనంగా కాన్వొకేషన్ డే



నల్గొండ, ఏప్రిల్ 22:యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కాన్వొకేషన్ డే ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అలాగే గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభచూపి సీట్లు సాధించిన 21 మంది విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్‌ఎం ఎన్.సి. యల్లయ్య మాట్లాడుతూ.. పుట్టపాక పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతో కృషి చేసినట్టు చెప్పారు. గత ఏడాది గురుకుల ఎంట్రన్స్ లో పుట్టపాక పాఠశాల నుంచి 31 మంది విద్యార్థులు సీట్లు సాధించగా, ఈ ఏడాది 21 మంది విద్యార్థులు సీట్లు సాధించినట్లు తెలిపారు. మరికొంతమంది విద్యార్థుల పేర్లు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడు సహకారం

మరో అతిథి, పాఠశాల పూర్వ విద్యార్థి, ఎంఎన్‌ఆర్ ట్రస్ట్ ప్రతినిధి మర్రి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలే ఉచిత, నాణ్యమైన విద్యను, సరైన జీవన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తున్నాయన్నారు. అందుకు పుట్టపాక ప్రాథమిక పాఠశాలనే నిదర్శనమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా ప్రభుత్వ పాఠశాలలోనూ కాన్వొకేషన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇక్కడి నుంచి ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకుల పాఠశాలలకు అర్హత సాధించడం గ్రామానికి గర్వకారణం అన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు తనతోపాటు గ్రామస్తుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు.

గురుకులం సీట్లు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లోనూ ఉన్నతంగా ఎదిగి పాఠశాలతో పాటు పుట్టిన ఊరు పుట్టపాకకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలను జిల్లాలోనే ప్రత్యేకంగా నిలబెడుతున్న ఉపాధ్యాయ బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులకందరికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విమల, హేమలత, పద్మావతి, ఏ.శ్రీనివాస్, సునీత, ఏఏపీసీ చైర్‌పర్సన్ జి.కృష్ణవేణి, రజిని, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలి : కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 22:రాష్ట్ర ముఖ్యమంత్రిగా, హోం మినిస్టర్‌గా, కొడంగల్ ఎమ్మెల్యేగా లగచర్లలో పోలీసులు చేసిన దౌర్జన్యానికి బాధ్యత తీసుకొని.. సిగ్గు ఉంటే ముక్కు నేలకి రాసి రేవంత్ రెడ్డి రాజీనామా రాయాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనపై ఎన్‌హెచ్ఆర్సీ సంచలన విషయాలు బయటపెట్టారు. లగచర్ల రైతులను కొట్టి, శారీరకంగా హింసించారని జాతీయ మానవ హక్కుల కమిషన్ దర్యాప్తు బృందం నిర్ధారించిన సంగతి తెలిసిందే.

ఇవాళ నందినగర్‌లో కేటీఆర్ నివాసంలో ఆయనను లగచర్ల బాధితులు కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. లగచర్లలో ఎక్స్‌ట్రాలు చేసి ప్రజలను చిత్ర హింసలు పెట్టి, ఆడపిల్లల మీద అఘాయిత్యాలకు పాల్పడ్డ పోలీస్ అధికారులను డిస్మిస్ చేయాలని నేను రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను అని తెలిపారు. భూసేకరణ కూడా చట్ట విరుద్ధంగా జరిగిందని ఎన్‌హెచ్ఆర్సీ చెప్పింది. దొంగచాటుగా భూసేకరణ చేయడం ఆపకపోతే కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ అవుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

లగచర్ల రైతులను పోలీసులు చిత్రహింసలు పెట్టి, దారుణంగా కొట్టారని ఎన్‌హెచ్ఆర్సీ రిపోర్ట్‌లో చెప్పారు. సొంత నియోజకవర్గ రైతులను దారుణంగా కొట్టించిన రేవంత్ రెడ్డికి సిగ్గు, ఇజ్జత్ ఉంటే ఈపాటికి రాజీనామా చేయాలి. కానీ రేవంత్ రెడ్డికి ఇజ్జత్ లేదు. పోలీసులు తమపై లైంగిక దాడి చేశారని లగచర్ల మహిళలు ఎన్‌హెచ్ఆర్సీ బృందానికి తెలిపారు. రాత్రిపూట గ్రామంపై పోలీసులు దాడి చేసి మహిళల తొడలపై దారుణంగా కొట్టి, కొట్టినట్టు జడ్జి ముందు చెప్తే ఇంకా దారుణంగా కొడతామని బెదిరించారని గిరిజన మహిళలు ఎన్‌హెచ్ఆర్సీ వాళ్లకు చెప్పారని కేటీఆర్ తెలిపారు.

# సౌదీ అరేబియా పర్యటనకు బయలుదేరే ముందు ప్రధాని ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:యువరాజు, ప్రధాన మంత్రి ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ రోజు సౌదీ బయలుదేరి వెళుతున్నాను.

సౌదీ అరేబియాతో దీర్ఘకాలంగా ఉన్న చారిత్రక సంబంధాలను చాలా విలువైనవిగా భారత్ పరిగణిస్తోంది. ఇటీవలి సంవత్సరాల్లో ఇవి వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. రెండు దేశాల మధ్య రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, ప్రజల మధ్య సంబంధాలతో పాటు ఇతర అంశాల్లో పరస్పరం ప్రయోజనం కలిగించే కీలకమైన భాగస్వామ్యాన్ని కలసి అభివృద్ధి చేశాం. ఉమ్మడి సహకారంతో ప్రాంతీయంగా శాంతి, సంక్షేమం, భద్రత, స్థిరత్వం సాధించేందుకు ఆసక్తితో, అంకిత భావంతో ఉన్నాం.

దశాబ్ద కాలంలో సౌదీ అరేబియాకు ఇది నా మూడో పర్యటన. చారిత్రక నగరమైన జెడ్డాను మొదటిసారి సందర్శిస్తున్నాను. నా సోదరుడు, యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ 2023లో విజయవంతంగా చేపట్టిన భారత్ పర్యటన అనంతరం నిర్వహిస్తున్న వ్యూహాత్మక భాగస్వామ్య మండలి రెండో సమావేశంలో పాల్గొనేందుకు ఎదురుచూస్తున్నాను.

అదేవిధంగా సౌదీ అరేబియాలో నివసిస్తూ.. రెండు దేశాల మధ్య వారధిలా పనిచేస్తూ, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న భారతీయులతో ముచ్చటించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

# పార్లమెంటే అత్యున్నతమైంది: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఇవాళ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటే అత్యున్నతమైందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన బిల్లులను ఉద్దేశిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు కొన్ని వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. నిర్దేశిత గడువులోగా రాష్ట్రపతి అయినా, గవర్నర్లు అయినా.. బిల్లులను క్లియర్ చేయాలని సుప్రీం కోర్టు పేర్కొన్నది. ఆ వ్యాఖ్యలను ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ తప్పుపట్టారు. రాష్ట్రపతికి ఆదేశాలు ఇచ్చే అధికారం న్యాయవ్యవస్థకు లేదన్నారు. అయితే ఇవాళ మళ్లీ అదే అంశంపై ఆయన రియాక్ట్ అయ్యారు. శాసన వ్యవస్థే అత్యున్నతమైందని, రాజ్యాంగం ఎలా ఉండాలన్న దాన్ని నిర్ణయించేది ఎన్నికైన ప్రజాప్రతినిధులే అని, అంతకు మించిన అధికారం ఎవరికీ లేదని జగదీప్ ధన్‌కర్ తెలిపారు. ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన జరిగిన కార్యక్రమంలో ధన్‌కర్ పాల్గొన్నారు. సుప్రీంకోర్టుపై చేసిన వ్యాఖ్యలకు వస్తున్న విమర్శలను కౌంటర్ చేస్తూ మరో సారి ఆయన న్యాయ వ్యవస్థను టార్గెట్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం తాను మాట్లాడిన ప్రతి మాట.. అత్యున్నతమైన జాతి ప్రయోజనాలతో చేసిందే అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ని సుప్రీంకోర్టు దుర్వినియోగం చేస్తున్నట్లు ఇటీవల ధన్‌కర్ ఆరోపించారు. ఆ ఆర్టికల్‌ను అణ్వాయుధ క్షిపణిగా ప్రజాస్వామ్య దళాలపై వాడుతున్నట్లు ఆయన ఆరోపించారు.

# గుట్ట టాస్కా జోరు - గ్రామాల్లో ప్రచార హోరు

**–వృద్ధులకు చట్ట సంరక్షణ : ఏసిపి రమేష్ కుమార్**
**– బాధ్యతలపై అవగాహన: ఎంపిడిఓ నవీన్ కుమార్**
**– తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే : మాజీ ఎంపీపి: చీర శ్రీశైలం**
**–అవగాహనతోనే చైతన్యం: గుట్ట డిటి సత్యం**
**–వృద్ధులకు అండగా గుట్ట టాస్కా: అధ్యక్ష కార్యదర్శులు జయమోహన చార్య, చక్రపాణి**

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : వయో వృద్ధుల సంరక్షణపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పథకాల అమలు, అవగాహనపై యాదగిరిగుట్ట మండల టాస్కా ( తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) చేపట్టిన



ప్రచార జోరుతో గ్రామాల్లో మంచి స్పందన కనిపిస్తోంది. యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్, ఎమ్మార్వో, ఎంపీడీఓ కార్యాలయాల్లో మండల టాస్కా అధ్యక్షకార్యదర్శులు ముడుంబై జయమోహనా చార్య, పులగం చక్రపాణి నేతృత్వంలో చేపట్టిన ప్రచార పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాల్లో అధి కారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులనుంచి మంచి స్పందన కనిపించింది.

వృద్ధులకు చట్ట సంరక్షణ: ఏసిపి రమేష్ కుమార్

వయో వృద్ధుల సంరక్షణపై పిల్లలు నిర్లక్ష్యం చేయడం తగదని, అన్యాయం జరిగితే పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఏసిపి పి రమేష్ కుమార్ సీనియర్ సిటిజన్స్ కు సూచించారు. వృద్ధుల సంరక్షణపై జిల్లా పోలీసు అధికారులు ఇప్పటికే సూచనలు జారీ చేశారని అన్నారు. టాస్కా ప్రచార పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు.

బాధ్యతలపై అవగాహన: ఎంపీడీఓ నవీన్ కుమార్

మండల టాస్కా చేపట్టిన ప్రచారంతో వృద్ధుల సంరక్షణపై మంచి అవగాహన ఏర్పడు తుందని మండల ఎంపీడీఓ నవీన్ కుమార్ అన్నారు. టాస్కా ప్రచార కార్యక్రమ పోస్టర్ ను ఆవిష్కరించారు. టాస్కా కమిటీ కృషిని ఆయన అభినందించారు.

పోషణ బాధ్యత పిల్లలదే : మాజీ ఎంపీపి చీర శ్రీశైలం

కుటుంబం కోసం అహర్నిశలు కృషి చేసి వృద్ధాప్యం లో ఉన్న తల్లిదండ్రులను పోషించే బాధ్యత సంపూర్ణంగా పిల్లలదేనని మాజీ ఎంపీపి చీర శ్రీశైలం అన్నారు. ప్రచార పోస్టర్ ఆవిష్కరణ లో ఆయన పాల్గొంటూ వృద్ధుల సంరక్షణ, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. వృద్ధులకు సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు.

ప్రచారంతో నే అవగాహన: డిటి సత్యం

ప్రచార కార్యక్రమంతో సమాజంలో అవగాహన పెరుగుతుందని యాదగిరిగుట్ట మండల డిప్యూటీ తహసీల్దార్ సత్యం అన్నారు. కార్యాలయం ఆవరణలో టాస్కా పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు.

జోరుగా సభ్యత్వాలు: జయమోహనా చార్య, చక్రపాణి

మండలంలోని ప్రతి గ్రామంలో వయో వృద్ధులను సభ్యులుగా చేర్పించేందుకు యాదగిరిగుట్ట టాస్కా చేపట్టిన ప్రచార పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంచి స్పందన కనిపిస్తోందని మండల టాస్కా అధ్యక్ష కార్యదర్శులు ముడుంబై జయమోహనా చార్య, పులగం చక్రపాణి ఆనందం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో టాస్కా సంక్షేమ భవన నిర్మాణం కోసం అందరూ సంపూర్ణ సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రచార పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాల్లో టాస్కా నాయకులు, సభ్యులు డాక్టర్ రాగి సహదేవ్,ఎం నరసింహారెడ్డి, పులుగం బాలరాజు, నూకల సుధాకర్ రెడ్డి, గుంటి యాదగిరి, గుండ్లపల్లి మల్లేశం గౌడ్, పన్నగేశ్వర్ రావు, కె మల్లారెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా విమానం కుప్పకూలడంతో అందులో ఉన్న ట్రైనీ పైలట్ మృతి

గుజరాత్ ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శిక్షణా విమానం కుప్పకూలడంతో అందులో ఉన్న ట్రైనీ పైలట్ మృతి చెందాడు. ఈ ఘటన గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాలో జరిగింది. అమ్రేలి పట్టణంలోని గిరియా రోడ్ ప్రాంతంలోని నివాస ప్రాంతంలో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో విమానం కూలిపోయిందని అమ్రేలి పోలీసు సూపరింటెండెంట్ సంజయ్ ఖరత్ అన్నారు. అధికారుల వివరాల ప్రకారం.. అమ్రేలి విమానాశ్రయం నుండి బయలుదేరిందన ఓ ప్రైవేటు సంస్థకు చెందిన శిక్షణ విమానం కాసేపటికే కూలిపోయింది. శాస్త్రి నగర్ ప్రాంతం సమీపంలో కూలిపోయిన విమానంలో మంటలు చెలరేగి దగ్ధమైంది. దీంతో అందులో ఉన్న ట్రైనీ పైలట్ చనిపోయాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని ఎస్పీ తెలిపారు.

# సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటిన తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు

హైదరాబాద్ ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. ఎట్టబోయిన సాయి శివానికి 11వ ర్యాంకు వచ్చింది. ఇక బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించాడు. అభిషేక్ శర్మకు 38వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డికి 46వ ర్యాంకు, శ్రవణ్‌కుమార్ రెడ్డికి 62వ ర్యాంకు, సాయి చైతన్య జాదవ్‌కు 68వ ర్యాంకు, ఎన్ చేతనరెడ్డికి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డికి 119వ ర్యాంకు వచ్చాయి.యితే ఈసారి టాప్–10 జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఒక్కరు కూడా లేరు. శక్తి దూబే అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంకు వచ్చింది. ఆ తర్వాత హర్షిత గోయెల్, డోంగ్రే అర్చిత్ పరాగ్, షా మార్గి చిరాగ్, ఆకాశ్ గార్గ్, కోమల్ పూనియా వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు ర్యాంకులు సాధించారు. ఆయుషి బన్సల్, రాజ్‌కృష్ణ ఝా, ఆదిత్య విక్రమ్ అగర్వాల్, మయాంక్ త్రిపాఠిలు వరుసగా 6 నుంచి 10 ర్యాంకులు దక్కించుకున్నారు.కాగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో మొత్తం 1056 ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర పోస్టుల భర్తీకి గత ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. మెయిన్స్‌లో సత్తాచాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు దశల వారీగా పర్సనల్ ఇంటర్వ్యూలు చేశారు.తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. మొత్తం 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109 మంది, ఓబీసీ నుంచి 318 మంది, ఎస్సీ కేటగిరీలో 160 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 87 మంది చొప్పున ఉన్నారు.

# 35 మందితో డేటింగ్.. పోలీసులు అరెస్టు

హైదరాబాద్ ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఒకరిని లేదా ఇద్దరిని ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. కానీ ఏకంగా ఓ వ్యక్తి 35 మందితో డేటింగ్ చేశాడు. పురాణాలలో శ్రీకృష్ణుడు 16 వేల మంది గోపికలను పెళ్లి చేసుకున్నారు. జపాన్‌కు చెందిన తకాశి మియాగావా అనే వ్యక్తి 35 మందితో సహజీవనం చేశాడు. ఆ వ్యక్తి నిజ స్వరూపం బయటపడడంతో 35 మంది బామలు అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసలు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తకాశి సేల్స్‌మెన్‌గా పని చేసేవాడు. తకాశి మంచి మాటకారి కావడంతో చూస్తుండగానే అమ్మాయిలను బుట్టులో వేసుకునేవాడు. సంవత్సరం పొడవునా ఏదో ఒక రూపంలో బహుమతులు పొందాలని ప్లాన్ చేశాడు.కస్టమర్స్‌తో ఏమోషనల్‌గా కనెక్ట్ అవుతూ వచ్చాడు. ప్రేమ పేరుతో వారితో దగరయ్యేవాడు. 35 మంది సహజీవనం చేస్తూ ఏదో ఒక్కో రోజు తన బర్త్ డే అని చెబుతూ బహుమతులు తీసుకునేవాడు. సహజీవనంలో బహుమతులు ఇవ్వడం అనేది జపాన్ లో అనవాయితీగా వస్తుంది. ఎక్కువ సార్లు బహుమతులు తీసుకొని ఎంజాయ్ చేసేవాడు. లక్షల రూపాయల బహుమతులు తీసుకొని సంతోషంగా ఉండేవాడు. మనోడి సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. ఓ యువతి అతడి గురించి తెలుసుకొని విక్టిమ్ అసోసియేషన్ ఏర్పాటు చేసింది. దీంతో అతడి బాధితులు 35 మంది రావడంతో నిరసన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మోసం చేశాడనే ఆరోపణలతో అతడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహిళలను తప్పుదారి పట్టించి ఆర్థిక లాభం పొందారని జపాన్ చట్టం ప్రకారం శిక్షగా పరిగణించబడింది.

# పోప్ ఫ్రాన్సిస్ మరణం మానవాళికి తీరని లోటు

**తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్**

హైదరాబాద్ ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పోప్ ఫ్రాన్సిస్ మరణం రోమన్ కాథలిక్ చర్చికి విషాదకరమైన వార్త అని, మానవాళికి తీరని లోటని తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ పేర్కొన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల దీపక్ జాన్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ గొప్ప విశ్వాసం, వినయం మరియు కరుణ కలిగిన వ్యక్తి. కాథలిక్ చర్చికి మరియు ప్రపంచానికి పోప్ ఫ్రాన్సిస్ అందించిన అద్భుతమైన నాయకత్వానని అందించారని పేర్కొన్నారు.తన పాపసీ కాలంలో, సువార్త ప్రచారం, న్యాయం, దయ, ప్రేమ మరియు సయోధ్యను చూపించడానికి ఆయన పవిత్ర పోప్ ఫ్రాన్సిస్ నిరంతరం లోతైన నిబద్ధతను ప్రదర్శించారని కొనియాడారు. ఆయన మాటలు మరియు చర్యలు లక్షలాది మంది హృదయాలను తాకాయని,, క్రైస్తవ విభజనల సరిహద్దులను అధిగమించాయి మరియు మరింత న్యాయమైన మరియు కరుణామయమైన ప్రపంచాన్ని సాధించడంలో అన్ని మతాల ప్రజలు చేతులు కలపడానికి ప్రేరేపించాయని పేర్కొన్నారు. పేదలు, శరణార్థులు మరియు దుర్బల వర్గాల దుస్థితి పట్ల దివంగత పోప్ యొక్క అచంచలమైన అంకితభావం మనందరికీ స్ఫూర్తినిచ్చింది. పోప్ ఫ్రాన్సిస్ అవిశ్రాంతంగా మతాంతర సంభాషణ మరియు శాంతిని ప్రోత్సహించారు, అణగారిన వారి పక్షాన నిలిచారు. మత స్వేచ్ఛ, ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ మరియు ఇతరుల అభిప్రాయాలను గౌరవించకుండా శాంతి ఉండదని ఆయన నిజంగా విశ్వసించారు. "ఆందోళన కలిగించే" యూదు వ్యతిరేకతను మరియు గాజా ఉక్రెయిన్ "దుర్భరమైన" పరిస్థితిని కూడా ఆయన ఖండించారన్నారు.పవిత్ర పోప్ ఫ్రాన్సిస్ చర్చిని ఆధునిక ప్రపంచానికి తెరవడానికి ప్రయత్నిస్తున్నట్లు విస్తృతంగా చూడబడ్డారు. మహిళలు మరియు సామాన్యుల గొంతును నిర్ణయం తీసుకునే ప్రక్రియలలో చేర్చడం ద్వారా చర్చి నిర్మాణాలను పునరుద్ధరించడం ఆయన పాపసీకి ఒక నిర్వచనాత్మక గుర్తని దీపక్ జాన్ తన సంతాప సందేశం లో పేర్కొన్నారు.

# విలియం షేక్స్పియర్ ఎక్సెలెన్సీ అవార్డు 2025కు డాక్టర్ సంగీత ఎంపిక

హైదరాబాద్ ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రముఖ ఆంగ్ల భాష నిపుణురాలు,విద్యావేత్త, సాహితీవేత్త సెయింట్ జోసెఫ్ డిగ్రీ మరియు పీజీ కళాశాల కింగ్ కోటి ఆంగ్లభాష విభాగం అధినేత హెచ్ ఓ డి డాక్టర్ ఏ. సంగీత ను ఈ ఏడాది విలియం షేక్స్పియర్ ఎక్సెలెన్సీ అవార్డు 20 25 ను ఎంపిక చేసినట్టు వికాస చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ కె రామ్ గోపాల్ రెడ్డి నేడు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి ఒక్కరికి ఇచ్చే అవార్డు ప్రపంచ ఆంగ్ల భాష దినోత్సవం సందర్భంగా మరియు విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకొని ఈ అవార్డును ఈనెల బుధవారం 23వ తేదీన కింగ్ కోటి లోని సెంట్ జోసెఫ్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఈ అవార్డు ప్రధానం చేస్తామన్నారు. ప్రముఖ ఆంగ్ల విద్యావేత్త, ఉపన్యాసకురాలు, సాహితీవేత్త డాక్టర్ సంగీత మోత్కూర్ కింగ్ కోటిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఆంగ్లభాష విభాగం అధిపతిగా 21 సంవత్సరాలుగా అందరి మన్ననలను పొంది, ఆంగ్లభాష అభివృద్ధికై పనిచేస్తున్నారు. డిగ్రీ పీజీ విద్యార్థులకు ఆంగ్లభాష నైపుణ్యాన్ని ప్రోత్సహించడం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, స్టాఫ్ స్కిల్స్, బోధన ప్రొఫైల్స్ ను రూపొందించడం మరియు అమలు చేయడం ఆమె అభిరుచి. డాక్టర్ సంగీత యుజిసి స్టాఫ్ రిఫ్రెషర్ కోర్స్ కోసం షెడ్యూల్ రూపకల్పన, అకాడమిక్ స్టాఫ్ కాలేజ్ ఉస్మానియా యూనివర్సిటీలో ఇంగ్లీష్ ఫౌండేషన్ లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్, తెలంగాణ పోలీసుల కోసం కమ్యూనికేషన్ మరియు రిపోర్టింగ్ రైటింగ్ లో ఎన్నో శిక్షణ తరగతులు నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. నిజాం కళాశాల నుండి ఇంగ్లీష్ లిటరేచర్, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎమ్మె ఇంగ్లీష్, మరియు పీహెచ్డీ పట్టా పొందారు. డాక్టర్ సంగీత ఆంగ్ల సాహిత్య కమ్యూనికేషన్ ఇంగ్లీష్ మరియు టీచింగ్ పై పరిశోధనల పత్రాలను సమర్పించి ప్రచురించింది. ఈ సందర్భంగా తెలంగాణ మేధాలు ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ డాక్టర్ సంగీతకు శుభాకాంక్షలు తెలిపారు.

# జవహర్‌నగర్ వాసులు త్వరలోనే శుభవార్త వింటారు : కాప్రా తహశీల్దార్

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సర్కారు భూముల్లో అక్రమ కట్టడాలను సహించబోమని కాప్రా తహశీల్దార్ సుచరిత హెచ్చరించారు. పేద ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రభుత్వ భూముల్లో అక్రమాలను నేలమట్టం చేస్తామని అన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్‌లు వేస్తూ అమాయకులను దోచుకుంటున్న కబ్జాదారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని సుచరిత హెచ్చరించారు. కార్పొరేషన్‌లోని భూములపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే కంచెలు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కాపాడుతామని తెలిపారు. వర్షాలకు కూలిపోయిన ఇళ్లు, పాతది కూలగొట్టి కొత్తగా నిర్మించుకోవాలనే పేదల కోరికను కలెక్టర్‌కు విన్నవించామని చెప్పారు. త్వరలోనే జవహర్‌నగర్ వాసులకు శుభవార్త తెలుపుతామని అన్నారు.

# మద్యం మత్తులో భార్య, ఆమె తల్లిపై కత్తితో దాడి..

హైదరాబాద్, ఏప్రిల్ 22: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. మద్యం మత్తులో భార్యతో పాటు ఆమె తల్లిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మియాపూర్ జనప్రియ నగర్‌లో నివాసం ఉండే మహేష్ రెండేళ్ల క్రితం శ్రీదేవిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఏడాది పైబడిన కూతురు ఉన్నది.

క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్న మహేష్ మద్యం మత్తుకు బానిస అయ్యాడు. ఈ క్రమంలో తరచూ భార్యాభర్తల మధ్య తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. మహేష్ పెట్టె హింస భరించలేక శ్రీదేవి తన పుట్టింటికి వెళ్ళింది. తన తమ్ముడి ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు వెళ్లాల్సి ఉందని మహేష్ తన భార్య శ్రీదేవిని పుట్టింటి నుంచి జనప్రియ నగర్‌లోని తన ఇంటికి సోమవారం పిలిపించుకున్నాడు .ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మరోసారి తగాదా చోటుచేసుకోవడంతో ఆవేశంతో మద్యం మత్తులో ఉన్న మహేష్ కూరగాయలు కోసే కత్తితో తన భార్య శ్రీదేవిపై దాడికి పాల్పడ్డాడు. అడ్డు వచ్చిన ఆమె తల్లిపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని హాస్పిటల్‌కు తరలించారు.

# లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం..

**–రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి**

హైదరాబాద్, ఏప్రిల్ 22: హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారని, రేపు 23న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, రెండు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితో పాటు మరికొంత మంది సిబ్బందిని రిజర్వ్ లో పెట్టామని చెప్పారు.ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారని, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. సుమారు 200 నుండి 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. దాదాపు 500 మంది అధికారులు, సిబ్బంది ఎలక్షన్ డ్యూటీ లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

# మానవచరిత్రలో మొట్టమొదటి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించింది లెనిన్

**- ఎన్.వి రాకేష్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు**




ఖమ్మం, ఏప్రిల్ 22: (నేటినిజం ప్రతినిధి) :రష్యా దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంపూర్ణంగా అధ్యయనం చేస్తూ నాటి పీడించబడుతున్న ప్రజల విముక్తి కోసం జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా రష్యా కమ్యూనిస్టు పార్టీని స్థాపించి 1917లో విప్లవాన్ని తీసుకొచ్చిన మహా గొప్ప వ్యక్తి లెనిన్ అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.వి రాకేష్ అన్నారు. మంగళవారం లెనిన్ 155వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్.వి రాకేష్ మాట్లాడుతూ...లెనిన్ చిన్నతనం నుండి నిరంతర అధ్యయనం చేస్తూ అపార మేధ శక్తిని సంపాదించి కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలైనా మార్క్స్, ఏంగెల్స్ రచనలను ప్రభావితంగా రష్యా సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసి ప్రజలను విప్లవానికి సిద్ధం చేశారని వారు కొనియాడారు. నాడు పట్టిపీడిస్తున్న పెట్టుబడి దారి ఆర్థిక దోపిడి బండారాలను తెంచి రష్యాకు స్వేచ్ఛను తీసుకువచ్చిన మహానీయుడని అన్నారు. భూ ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా మానవజాతి చరిత్రలో సోషలిస్టు రాజ్యాన్ని ఆచరణ ద్వారా సుసాధ్యం చేసిన మహానీయుడు అని అన్నారు. అతివాద, మితవాద పందాలను పూర్తిగా తిరస్కరిస్తూ నిజమైన విప్లవ కమ్యూనిస్టు వైపు నడుస్తూ భూతల స్వర్గాన్ని రష్యాలో నెలకొల్పాలని, అలాంటి మార్గంలో భారత దేశ ప్రజలు ముందుకు పోవాలని వారు పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ నాయకులు ప్రభాకర్, దిలీప్, బెన్నీ, సోనీ, నాగమణి, వెంకటేశ్వర్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు డ్రైవింగ్ చేస్తే.. తల్లిదండ్రులే బాధ్యులవుతారు : అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22:చట్ట ప్రకారం మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే అందుకు తల్లిదండ్రులు బాధ్యులవుతారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు–నిఆవరణపై ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన ట్రాఫిక్ ఉల్లంఘనదారుల తల్లిదండ్రులకు రెండు రోజులుగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం నాడు కూడా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. మైనర్ల డ్రైవింగ్ కేసుల్లో తల్లిదండ్రుల వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు సస్పెండ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అన్ని విధాల వాహన డాక్యుమెంట్లు ఉండాలని, అర్హులైన వారే వాహనాలను ట్రాఫిక్ ఉల్లంఘనలు లేకుండా వాహనాలను నడపాలని సూచించారు.

